



సికింద్రాబాద్‌లో వైభవంగా వేడుకలు

- అమ్మవార్లకు బోనాలు సమర్పించిన మహిళలు
- ఆకట్టుకున్న పోతరాజుల విన్యాసాలు
- ప్రజాప్రతినిధులు, పలువురి పూజలు



బోనమెత్తిన లష్కర్


గండి మైసమ్మ ఆలయం వద్ద భక్తుల కోలాహలం


ఉజ్జయినీ మహంకాళి ఆలయం వద్ద పోతరాజుల విన్యాసాలు

సికింద్రాబాద్‌లో ఆదివారం బోనాల సందడి నెలకొన్నది. నగరంలోనే ప్రసిద్ధ ఉజ్జయినీ మహంకాళి ఆలయంతో పాటు సుమారు 40 దేవాలయాల్లో ఒకేరోజు బోనాలు, రంగం కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఇందులో భాగంగా కళాసీగూడ, శివాజీనగర్, రాణిగంజ్, రెజిమెంటల్‌బజార్ తదితర ప్రాంతాల్లోని ఆలయాలకు భక్తులు బోనం, సాక, తొట్టెలు సమర్పించేందుకు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో రద్దీగా మారాయి. వీధులన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించడంతో పాటు ఎక్కడ చూసినా అమ్మోరి పాటలతో మారుమోగాయి. గండిమైసమ్మ దేవాలయంలో ఎంపీ మైనంపల్లి రోహిత్, ఈటల రాజేందర్, ఎమ్మెల్యే శ్రీగణేశ్ పూజలు చేశారు. కీస్ హైస్కూల్‌లో కార్పొరేటర్ కొంతం దీపిక ఏర్పాటు చేసిన పూజల్లో హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఈటల రాజేందర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాంగోపాల్‌పేట్


భక్తులతో కిటకిటలాడుతున్న ఉజ్జయినీ మహంకాళి ఆలయం


మహంకాళి ఆలయంలో ఎమ్మెల్యే దానం నాగేందర్


బోనంతో కోట నీలిమ..



మేడ్చల్, కంటోన్మెంట్ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, శ్రీగణేశ్


వీహెచ్ హనుమంతారావు..


మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి ..


కీస్ హైస్కూల్‌లో కార్పొరేటర్‌కు బోనం అందిస్తున్న ఎంపీ ఈటల



కోట శ్రీనివాసరావుకు ఘన నివాళి


నివాళులర్పిస్తున్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బంజారాహిల్స్: సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. ఫిలింనగర్‌లోని నివాసంలో కోట శ్రీనివాసరావు పార్థీవదేహానికి ఆదివారం నివాళులర్పించారు. 750కి పైగా చిత్రాల్లో వివిధ పాత్రల్లో విలక్షణ నటనతో ప్రేక్షకుల అభిమానాన్ని దక్కించుకున్న గొప్ప నటుడు శ్రీనివాసరావు అని కొనియాడారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు చెప్పారు.

విద్య, ఉద్యోగాల్లోనూ బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయంపై బీసీ జాతీయ నేత ఆర్.కృష్ణయ్య, విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ విద్యా సంవత్సరం నుంచి విద్య, ఉద్యోగ రంగాల్లోనూ 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరినట్లు వారు తెలిపారు. అధిక జనాభా గల బీసీలు విద్య, ఉద్యోగావకాశాలతో పాటు ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధి సాధించినప్పుడే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

'సెయింట్ జాన్ అంబులెన్స్' ఉచిత వైద్య శిబిరం



సాక్షి, సిటీబ్యూరో: బోనాల పండగ నేపథ్యంలో ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్టు కోఠి డీఎం అండ్ హెచ్‌ఎస్ క్యాంపస్ లోని సెయింట్ జాన్ అంబులెన్స్ సర్వీస్ సెక్రటరీ డాక్టర్ ఎం.మహేంద్ర కుమార్, డైరెక్టర్ వి.వి.వి.ఎస్.మూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురికి ఉచిత వైద్య సేవలు అందించామని.. గాయపడినవారికి తక్షణమే చికిత్స చేశామని వెల్లడించారు. డాక్టర్ నీరజా లక్ష్మి, సీనియర్ అధ్యాపకులు మోహిన్, రాజ్ కుమార్ సింగ్ శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించినట్టు వివరించారు. బోనాల సందర్భంగా ఆలయానికి వచ్చే భక్తుల కోసం ఈ శిబిరం నిర్వహించామని పేర్కొన్నారు.

మహంకాళి బోనాల్లో నేడు రంగం

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాల్లో రెండో అంకమైన రంగం కార్యక్రమం సోమవారం జరుగనున్నది. అవివాహిత స్త్రీ స్వర్ణలత మహంకాళి ఆలయంలో ఉండే మాతంగేశ్వరి ఆలయం ఎదురుగా పచ్చికుండపై నిల్చొని భవిష్యవాణి వినిపించనున్నది. సోమవారం ఉదయం 9.30 గంటలకు అమ్మవారు ఆమెను ఆవహించగా భవిష్యత్తులో జరగబోయే వాటి గురించి చెప్పనున్నది. ఆమె నోటి నుంచి వచ్చే ప్రతి మాట అమ్మవారి వాక్కుగా భక్తులు భావిస్తారు. ఈ భవిష్యవాణి కోసం లక్షలాది మంది భక్తులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుంటారు. తర్వాత అమ్మవారిని అంబారిపై ఉంచి ఆలయం నుంచి మంగళవాయిద్యాలు, భాజాభజంత్రీలతో వందలాది మంది భక్తులు కోలాటాలు, నృత్యాలు చేస్తుండగా అమ్మవారిని సాగనంపు నిర్వహిస్తారు. ఆలయం నుంచి మెట్టుగూడలోని అమ్మవారి దేవాలయం వరకు కొనసాగనున్నది. దీంతో అమ్మవారి బోనాల ఉత్సవాలు ముగిసినట్లు భావిస్తారు.

బల్కంపేట అమ్మవారికి బోనాలు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారిని ఆదివారం వివిధ రకాల పూలతో అలంకరించి పూజలు చేసినట్లు ప్రధాన అర్చకుడు అనిల్ పంతుల్ తెలిపారు.

బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబ సమేతంగా ఆదివారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు సాధారంగా స్వాగతం పలికారు. బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు.


కుటుంబ సమేతంగా బోనం సమర్పిస్తున్న మంత్రి పొన్నం


ప్రత్యేక అలంకరణలో బల్కంపేట అమ్మవారు

10 వేల ర్యాంక్ సీలింగ్ ఎత్తివేయాలి


మాట్లాడుతున్న సైదులుయాదవ్

ఉస్మానియా యూనివర్సిటీ: ఇంజినీరింగ్ కోర్సుల్లో బీసీ, ఈబీసీ విద్యార్థులకు 10 వేల ర్యాంక్ సీలింగ్ విధానాన్ని ఎత్తివేయాలని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మన బోయిన సైదులు యాదవ్ డిమాండ్ చేశారు. ఓయూలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ర్యాంకులతో సంబంధం లేకుండా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు బోధన ఫీజు, స్కాలర్‌షిప్‌లను పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని అదేవిధంగా బీసీ, ఈబీసీలకు కూడా చెల్లించాలన్నారు. రాష్ట్రంలోని 148 ఇంజినీరింగ్ కాలేజీల్లో 4 లేదా 5 కాలేజీలు మినహా ఇతర కాలేజీలు నిర్ణీత ఫీజుల కంటే అధికంగా వసులు చేస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో అభి, సురేశ్, శ్రీధర్, మధు, శంకర్, కార్తీక్, నరేశ్, గిరి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాలలకు రోస్టర్ పాయింట్లు తగ్గించాలి



మాట్లాడుతున్న మాందాల భాస్కర్

పంజగుట్ట: అంబేద్కర్ జయంతి రోజున ముఖ్యమంత్రి ఎస్సీ వర్గీకరణ బిల్లు జీవో 99 తీసుకువచ్చి అందులో రోస్టర్ విధానంలో మాల సామాజిక వర్గానికి తడిబట్టతో గొంతు కోసిన పనిచేశారని మాల సంఘాల జేఏసీ చైర్మన్ మాందాల భాస్కర్ అన్నారు. ప్రస్తుతం తీసుకువచ్చిన రోస్టర్ విధానం చూస్తుంటే మాల, మాల ఉపకులాల వారు తమను ఎస్సీ నుంచి తొలగించి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లో అయినా కలపమని కోరుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో జేఏసీ గౌరవ చైర్మన్ చెరుకు రాంచందర్‌తో కలిసి ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వర్గీకరణపై యావత్ మాల సమాజం ఆగ్రహంతో ఉందన్నారు. వెంటనే రోస్టర్ పాయింట్లు మార్చకపోతే మరో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. 30 ఏళ్లుగా మాలలు దోచుకుంటున్నారని ప్రచారం చేస్తున్నారని, ఇటీవల నిర్వహించిన షమీమ్ అక్తర్ నివేదికలోనే రాష్ట్రంలో మొత్తం 5 లక్షల 20 వేల మంది ప్రభుత్వ ఉద్యోగులుంటే అందులో ఎస్సీలు 93 వేల మంది ఉన్నారని, మాదిగలు 43 వేల మంది ఉంటే మాలలు 36 వేలు, మిగిలినవి మాల, మాదిగ ఉపకులాల వారు ఉన్నట్లు నివేదిక ఇచ్చిందని, దీంతో ఎవరు దోచుకుంటున్నారో అర్థం అవుతుందన్నారు. బేర బాలకిషన్, తాళ్లపల్లి రవి, నల్లల కనకరాజు, శేపూరి నరసింహ, డి.భాస్కర్, సైదులు, గాజుల పున్నమ్మ, జాకబ్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రసూల్‌పురా: సికింద్రాబాద్ డివిజనల్ ప్రెసిడెన్సీ అవెన్యూ, ఎంహెచ్‌ఆర్ కాలనీ 11 కేవీ ఫీడర్ల పరిధిలో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 వరకు ప్రెసిడెన్సీ ఆవెన్యూ మంగాపురంకాలనీ, గంగా అవెన్యూ, ఎస్వీ ఆఫీసర్స్ కాలనీ, గాంధీ నగర్, హరిజన బస్తీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ మురళీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు నాగదేవత టెంపుల్, ఆఫీసర్స్ కాలనీ 11 కేవీ ఫీడర్ల పరిధిలో ఆశా ఆఫీసర్స్‌కాలనీ, ఆఫీసర్స్‌కాలనీ, ఎస్వీ ఆఫీసర్స్‌కాలనీ, గాంధీనగర్, హరిజనబస్తీ, నాగదేవత టెంపుల్ ఏరియా, ఆర్మీ ఏరియా పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

నేడు ప్రత్యేక పూజలు

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా సనత్‌నగర్ హనుమాన్ ఆలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని గణపతి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ సత్యనారాయణనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు గణపతి హోమం, సాయంత్రం 6 గంటలకు పంచామృతాభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ దర్శనం, తీర్థ ప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.29, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 55, పచ్చిమిర్చి 65, బజ్జీమిర్చి 45, క్యాప్సికం 78, పచ్చకాకర 42, పందిరి బీర 40, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండ 28, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 50, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 22, ఆలుగడ్డ 24, చామగడ్డ 28, మొరంగడ్డ 28, కందగడ్డ 45, సొరకాయ 13, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3-4, ముల్లంగి 5-6. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

వ్యక్తి అదృశ్యం


వికాస్‌రెడ్డి

అడ్డగుట్ట: వ్యక్తి అదృశ్యమైన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ నాగరాణి తెలిపిన వివరాల ప్రకారం.. తార్నాకలోని విజయపురి కాలనీకి చెందిన యెరువ వికాస్‌రెడ్డి (35) ప్రైవేట్ ఉద్యోగి. నాలుగేళ్ల క్రితం పెళ్లి జరిగింది. రెండేళ్లుగా ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో నిత్యం ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లిన వికాస్‌రెడ్డి మళ్లీ తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారు, బంధువుల వద్ద వాకబు చేసినా ఆచూకీ లభించక పోవడంతో అతడి తండ్రి బాలషో రెడ్డి ఆదివారం లాలాగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సనత్‌నగర్ పీఎస్‌లో మహిళా పూజారి ఫిర్యాదు


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న పూజారి కృష్ణవేణి

సనత్‌నగర్: న్యాయం చేయాలని కోరుతూ ఓ మహిళా పూజారి కృష్ణవేణి సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులుకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది బోడ శ్రీను అనే వ్యక్తి బబ్బుగూడ బస్తీ అధ్యక్షుడిగా ఎన్నిక కాగా, అతను శివ అనే వ్యక్తిని గుడికి అధ్యక్షుడిగా ప్రకటించారన్నారు. ఆ తర్వాత శివ బలవంతంగా గుడి తాళాలు లాక్కొన్నారని, హుండీ డబ్బుల లెక్కలు చెప్పడం లేదని, ఇష్టారీతిన డబ్బులు తీస్తున్నారని ఆరోపించారు. జూలై 10న పెద్దల సమక్షంలో వారితో మాట్లాడగా తననే పూజారిగా ఉంచాలని నిర్ణయించారన్నారు. ఈ క్రమంలో లక్ష్మి, సింధూతో పాటు మరికొందరు తన ఇంటికి వచ్చి బెదిరించే యత్నం చేశారన్నారు. అంతేగాకుండా పోలీసు వాహనం తీసుకువచ్చి బలవంతంగా ఎక్కించే ప్రయత్నం చేశారన్నారు. గుడి విషయంలో అక్రమాలకు పాల్పడడమే కాకుండా తనను వేధిస్తున్న సదరు వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అదేవిధంగా 1972 నుంచి ఎల్లమ్మ, పోచమ్మ దేవతలకు పూజలు చేస్తున్న తనకు న్యాయం చేయాలని విన్నవించారు.

తీన్మార్ మల్లన్నపై దాడి సరికాదు


అల్లూరి విజయ్, ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై జరిగిన దాడిని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్ తీవ్రంగా ఖండించారు. ఆదివారం జాగృతి నాయకులు, ఎమ్మెల్సీ కవిత అనుచరులు క్యూ న్యూస్ ఛానెల్ పై దాడిచేసి ఫర్నీచర్ ధ్వంసం చేయడం దారుణమన్నారు. రాష్ట్రంలో బీసీల రాజకీయ ఎదుగుదలను చూసి ఓర్వలేకే దాడులు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ దాడిని బీసీలపై జరిగిన దాడిగా పరిణిస్తున్నట్లు పేర్కొన్నారు. నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

ఓయూ జేఏసీ ..

ఎమ్మెల్సీ మల్లన్నపై దాడిని ఓయూ జేఏసీ అధ్యక్షుడు బైరు నాగరాజుగౌడ్ ఖండించారు. ఆదివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ.. వ్యక్తులపై భిన్నాభిప్రాయాలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని భౌతిక దాడులు సరికాదన్నారు.

మీడియాపై దాడి సరికాదు

రాజకీయ వ్యాఖ్యల కారణాలతో మీడియాపై దాడులు చేయడం సరికాదని పీడీఎస్‌యూ (విజృంభన) రాష్ట్ర అధ్యక్షుడు అల్లూరి విజయ్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాజకీయ వ్యాఖ్యలను రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ మీడియాపై, జర్నలిస్టులపై దాడులు చేయడం సరికాదని పేర్కొన్నారు.

దివ్యాంగుల నేతకు డాక్టరేట్ ప్రదానం


డాక్టరేట్ అందుకుంటున్న పంది శ్రీను

లాలాపేట: తార్నాక డివిజన్ రవీంద్రనగర్‌కు చెందిన దివ్యాంగుల ఉద్యమనేత పంది శ్రీను గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. ఈయన 20 ఏళ్లుగా సామాజిక సేవారంగంలో చేస్తున్న కృషిని గుర్తించి హర్యానాలోని ఫరీదాబాద్‌లో గల మ్యాజిక్ అండ్ ఆర్ట్ యూనివర్సిటీ ఆదివారం ఢిల్లీలో ఆ యూనివర్సిటీ అధికారులు శ్రీనుకు గౌరవ డాక్టరేట్ సర్టిఫికెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ.. ఇది తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. డాక్టరేట్ అందజేసిన యూనివర్సిటీకి కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడుతానని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

సనత్‌నగర్: జెక్‌కాలనీలోని పార్థీవ్ లంగ్‌కేర్ సెంటర్ ఆధ్వర్యంలో కల్యాణ్‌నగర్ వెంచర్-3 రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సీనియర్ ఇంటర్వెన్షనల్ పల్మనాలజిస్ట్ డాక్టర్ నాగరాజు నేతృత్వంలో మోతీనగర్ జైస్వాల్ హాస్పిటల్ ఎదురుగా కల్యాణ్‌నగర్ వెంచర్-3 వివేకానంద పార్క్‌లో జరిగిన శిబిరంలో జనరల్ ఫిజిషియన్ డాక్టర్ మౌనిక బారెడ్డి, కన్సల్టెంట్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ రాధా బృందం వివిధ రకాల పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు.

వడ్డీ లేని రుణాలపై అవగాహన



బంజారాహిల్స్: ప్రభుత్వం స్వయం ఉపాధి పొందే మహిళా గ్రూపులకు వడ్డీ లేని రుణాలను అందిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు పాటుపడుతోందని జీహెచ్‌ఎంసీ సర్కిల్-18 యూసీడీ డీపీఓ ఆశా విరోనిక అన్నారు. వడ్డీ లేని రుణాలపై స్వయం సహాయక బృందాల సభ్యులకు మరింత అవగాహన కలిగించేందుకు బంజారాహిల్స్ రోడ్డు నంబర్-12లోని ఎన్‌బీనగర్ కమ్యూనిటీ హాల్‌లో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సాంస్కృతిక కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆటపాటలతో వడ్డీ లేని రుణాలపై మహిళలకు అవగాహన కల్పించారు. రుణాలు ఎవరు.. ఎలా తీసుకోవాలి.. ఎలా వ్యాపారాలు పెట్టుకోవాలి.. స్వయం ఉపాధి ఎలా పొందాలి.. తిరిగి రుణాలు ఎలా చెల్లించాలి.. అన్న విషయంలో అర్థమయ్యే రీతిలో బృందగానాలతో స్పష్టపరిచారు.